సాక్షి సూర్యాపేట

శనివారం । 24 । మే । 2025



విరుల సాగుతో సిరులు

కూనూరులో మహిళా రైతు రాజమణి పది గుంటల భూమిలో పూలు సాగు చేస్తూ లాభాలు ఆర్జిస్తుంది.

- 10లో



అదుపుతప్పి కారు బోల్తా

కారు అదుపు తప్పి బోల్తా కొట్టడంతో ఒకరు మృతి చెందగా.. ఏడుగురికి తీవ్ర గాయాలయ్యాయి.

- 10లో

గరిష్టం/కనిష్టం 36°/26°

వాతావరణం

మేఘావృతమై ఉంటుంది. ఉరుములతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

నకిలీ విత్తనాలు అమ్మితే పీడీ యాక్ట్ తప్పదు



కె.నరసింహ, ఎస్పీ

సూర్యాపేటటౌన్ : నకిలీ విత్తనాలు అమ్మితే పీడీ యాక్ట్ తప్పదని జిల్లా ఎస్పీ కె.నరసింహ శుక్రవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. నకిలీ విత్తనాలు గుర్తించి సీజ్ చేయాలని, నకిలీ విత్తనాల వల్ల జిల్లాలో ఒక్క రైతు కూడా నష్టపోవద్దని పేర్కొన్నారు. సంబంధిత అధికారులంతా సమన్వయంగా పనిచేసి రైతులకు నకిలీ వితనాలు సరఫరా కాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం నకిలీ విత్తనాల నిర్మూలనకు అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారని పేర్కొన్నారు. సూర్యాపేట జిల్లా ఆంధ్రా ప్రాంతానికి ముఖ్య సరిహద్దుగా ఉందని, ఇక్కడ నకిలీ విత్తనాలు ఎక్కువగా సరఫరా అయ్యే అవకాశం ఉందని చెప్పారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన డీలర్స్ నుంచి విత్తనాలు కొనుగోలు చేస్తే మంచిదని రైతులకు సూచించారు. నకిలీ విత్తనాల గురించి, అనుమానిత బ్రోకర్లు, డీలర్ల గురించి పోలీసు వారికి, వ్యవసాయ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

ఆపరేషన్ కగార్‌ను ఆపాలి

సూర్యాపేట అర్బన్ : ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టులపై కేంద్ర బలగాలు చేపట్టిన ఆపరేషన్ కగార్‌ను తక్షణమే ఆపాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావుతో సహా 27మందిని ఎన్‌కౌంటర్ చేయడాన్ని మా పార్టీ తీవ్రంగా ఖండిస్తుందని పేర్కొన్నారు. ఎన్‌కౌంటర్‌పై ప్రధాని, హోంమంత్రి హర్షం వ్యక్తం చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని పేర్కొన్నారు. ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌పై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరపాలని డిమాండ్ చేశారు. తక్షణమే కేంద్ర ప్రభుత్వం మావోయిస్టులతో చర్చలు జరపాలని కోరారు.

మట్టపల్లిలో కృష్ణమ్మకు హారతి పూజలు



కృష్ణానదికి హారతి ఇస్తున్న అర్చకుడు

మఠంపల్లి: మట్టపల్లి క్షేత్రంలో శుక్రవారం శ్రీరాజ్యలక్ష్మి, చెంచులక్ష్మి సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్య కల్యాణాన్ని అర్చకులు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు, హోమం అనంతరం స్వామి అమ్మవార్ల ఎదుర్కోలు మహోత్సవం నిర్వహించారు. అనంతరం నిత్యకల్యాణ వేడుక జరిపి నీరాజన మంత్ర పుష్పాలతో మహానివేదన గావించి భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. సాయంత్రం కృష్ణమ్మ తల్లికి ప్రహ్లాద్ ఘాట్‌లో అర్చకులు హారతిపూజలు చేశారు.

30న తలనీలాలకు బహిరంగ వేలం

మట్టపల్లి క్షేత్రంలో భక్తులు సమర్పించే తలనీలాల సేకరణకు ఈనెల 30న ఆలయంలో బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు విజయ్‌కుమార్, మట్టపల్లిరావు, ఈఓ నవీన్‌కుమార్ తెలిపారు. ఏడాది కాలం తలనీలాల సేకరణకు నిర్వహించే ఈ వేలంకు రూ.4లక్షలు డిపాజిట్‌గా చెల్లించి వేలంలో పాల్గొనాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు శ్రీనివాసాచార్యులు, పద్మనాభాచార్యులు, బదరీ నారాయణాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, ఫణిభూషణ మంగాచార్యులు, ఆంజనేయాచార్యులు, వంశీకృష్ణమాచార్యులు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ శేషగిరిరావు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలి



శిక్షణలో మాట్లాడుతున్న డీఈఓ అశోక్

గరిడేపల్లి: ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ఉపాధ్యాయులు కృషిచేయాలని డీఈఓ అశోక్ అన్నారు. శుక్రవారం గరిడేపల్లి మండల కేంద్రంలోని కేజీబీవీలో ప్రాథమిక, ప్రాథమికోన్నత స్థాయి ఉపాధ్యాయులకు నిర్వహించిన ఐదు రోజుల వృత్యంతర శిక్షణ ముగింపు కార్యక్రమాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు. బడిబాట ద్వారా విద్యార్థుల సంఖ్య పెంచుకొని పాఠశాలల అభివృద్ధికి తోడ్పాడాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ ఛత్రునాయక్, ఎంఆర్పీలు ఆర్.రాంబాబు, సైదులు, రవీందర్, నాగేశ్వరరావు, కోటేశ్వరరావు, నాగేశ్వరరావు, రాంబాబు, సీఆర్పీలు రామకృష్ణ, అశోక్, రాములు పాల్గొన్నారు.

ఎన్‌క్వాస్ గుర్తింపు కష్టమే!

- ఆరోగ్య కేంద్రాల్లో నాణ్యతా ప్రమాణాలు కరువు
- నిధుల లేమితో సమకూరని సౌకర్యాలు
- 25కు గాను 8 కేంద్రాలకే గుర్తింపు
- సందిగ్ధంలో మిగతా కేంద్రాలు
- జూన్‌లో తనిఖీలు ప్రారంభం



నాగారంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

జిల్లాలోని పీహెచ్‌సీలు	18
అర్బన్ హెల్త్ సెంటర్లు	07
బస్తీ దవాఖానాలు	04
ఆయుష్మాన్ ఆరోగ్యకేంద్రాలు	166

నాగారం : పీహెచ్‌సీలు, యూపీహెచ్‌సీలు, ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్(ఆమ్) ఉప కేంద్రాలు ఎన్‌క్వాస్ (నేషనల్ క్వాలిటీ అష్యూరెన్స్ స్టాండర్డ్స్ -జాతీయ నాణ్యతా హామీ ప్రమాణాలు) గుర్తింపు పొందడానికి నిధుల కొరత ఏర్పడింది. ఆయా కేంద్రాల నిర్వహణ అస్తవ్యస్తంగా ఉండడంతో కొన్నింటికి ఎన్‌క్వాస్ గుర్తింపు లభించడం గగనంగా మారింది. అయితే ఎన్‌క్వాస్ బృందం తనిఖీల సందర్భంగా ఆరోగ్య కేంద్రాల్లో మందులు నిల్వ ఉండాలి. మందులకు, వైద్యుడు, ఫార్మాసిస్ట్, ఏఎన్‌ఎంలకు గదులను ప్రత్యేకంగా ఏర్పాటు చేయాలి. కేంద్రాల్లో అందించే వైద్యసేవలు, వ్యర్థాలు, టీకాల నిర్వహణ, గర్భిణుల గుర్తింపు, మందుల పంపిణీ, కేంద్రం ఆవరణలో పచ్చదనం, జాతీయ పథకాల అమలు తీరుతోపాటు తదితర అంశాలు పక్కాగా ఉండాలి. ఇందుకుగాను ఒక్కో కేంద్రానికి కనీసం రూ.50 వేల నిధులు అవసరం. అయితే ఎంపిక చేసిన ఆరోగ్య కేంద్రాల్లో జూన్‌లో ఎన్‌క్వాస్ బృందం తనిఖీలు చేయనుంది. ప్రస్తుతం నిధులు లేకపోవడంతో జాతీయ నాణ్యతా ప్రమాణాల మేరకు కొన్ని కేంద్రాలను తీర్చిదిద్దలేని దుస్థితి నెలకొంది.

25 కేంద్రాలకు అవకాశం

జిల్లాలో 166 ఆరోగ్య ఉపకేంద్రాలు ఉండగా ప్రస్తుతం 25 కేంద్రాలకు ఎన్‌క్వాస్ గుర్తింపునకు అనుమతి లభించింది. వీటిలో ఇప్పటివరకు నాలుగు పీహెచ్‌సీలు, రెండు యూపీహెచ్‌సీలు, మరో రెండు ఆయుష్మాన్ మందిర్ (ఆమ్) ఆరోగ్య ఉప కేంద్రాలు ఎన్‌క్వాస్ గుర్తింపును పొందాయి. మిగతా ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ ఉప కేంద్రాలకు ఎన్‌క్వాస్ గుర్తింపు పొందేలా అన్ని హంగులతో తీర్చిదిద్దాల్సి ఉంది. ప్రస్తుతం మోతె మండలం బుర్కచర్ల ఆరోగ్య ఉపకేంద్రాన్ని జూన్-3, గరిడేపల్లి మండలం గడ్డిపల్లి ఆరోగ్య ఉపకేంద్రాన్ని జూన్-6న తనిఖీలు నిర్వహిస్తామని ఎన్‌క్వాస్ బృందం నుంచి సమాచారం అందించింది. మిగతా వాటికి అన్ని హంగులతో ఏర్పాట్లు పూర్తిచేశాక తనిఖీలు చేయనుంది.

గుర్తింపు పొందితే ప్రయోజనాలివే..

ఎన్‌క్వాస్ గుర్తింపు పొందితే పీహెచ్‌సీలకు ఏడాదికి రూ.3లక్షలు, ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ ఉప కేంద్రాలకు రూ.1.25 లక్షలు, యూపీహెచ్‌సీలకు రూ.2లక్షల చొప్పున మూడేళ్లపాటు కేంద్రప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం అందుతుంది. అనంతరం గుర్తింపు రెన్యువల్ పొందితే మరో మూడేళ్లు ఈ సాయం అందిస్తారు. కేంద్రం అందించే సాయంలో 75 శాతం నిధులు కేంద్రాల నిర్వహణ, అత్యవసర మందుల కొనుగోళ్లు, తాగునీటి వసతి ఏర్పాటు, పచ్చదనం, పరిశుభ్రత తదితరాలకు వ్యయం చేస్తూ మెరుగైన వైద్యం అందించటానికి ఖర్చు చేసుకునే వెసులుబాటు ఉంది. మిగతా 25శాతం సిబ్బంది మరిన్ని మెరుగైన సేవలు అందించేలా ప్రోత్సాహకాలు అందించటానికి వీలు కల్పించారు.

పొలాల్లో మట్టి తవ్వి.. రోడ్డు విస్తరణ పనులు !



రైతుల పొలాల్లో మట్టి తవ్వి రోడ్డుకు పోసిన కాంట్రాక్టర్

- నేరేడుచర్ల- దూపాడు రోడ్డు నిర్మాణ పనుల్లో కాంట్రాక్టర్ నిర్వాకం
- ఇదేమిటని ప్రశ్నిస్తే ప్రభుత్వ స్థలమంటూ బెదిరింపులు
- గగ్గోలు పెడుతున్న నేరేడుచర్ల మండల రైతులు



రైతుల పొలాల్లో కాంట్రాక్టర్ జరిపిన తవ్వకాలు

నేరేడుచర్ల : మంత్రి ఉత్తమ్‌కుమార్ సొంత నియోజకవర్గంలో చేపట్టిన రోడ్డు పనులను సదరు కాంట్రాక్టర్ నిబంధనలకు విరుద్ధంగా కొనసాగిస్తున్నాడు. నిబంధనలు పాటిస్తే లాభాలు రావనే ఉద్దేశంతో నాణ్యత లేకుండా కల్వర్టులు, రోడ్డు విస్తరణ పనులు చేయిస్తున్నాడు. పైగా ఎలాంటి అనుమతులు లేకుండా రైతుల పొలాల్లో గాతులు తీస్తూ అందులో వెళ్లిన మట్టితో రోడ్డు విస్తరణ పనులు చేయిస్తున్నాడు. ఇదేమిటని ఎవరైనా ప్రశ్నిస్తే వారిని బెదిరిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.

అనుమతి లేకుండా మట్టి తవ్వకాలు

నేరేడుచర్ల నుంచి వయా పత్తెపురం పెన్‌పహాడ్ మండలం దూపాడుకు వరకు దాదాపు 14 కిలోమీటర్ల రోడ్డు విస్తరణ పనులను సూర్యాపేట పట్టణానికి చెందిన ఎస్‌కేఆర్ కాంట్రాక్టర్ దక్కించుకున్నాడు. దీంతో గతకొన్ని రోజులుగా రోడ్డు నిర్మాణ పనులు చేయిస్తున్నాడు. ఇంత వరకు బాగనే ఉన్నా.. సదరు కాంట్రాక్టర్లు రోడ్డు విస్తరణ చేయాలంటే ఆ రోడ్డుకు మట్టిపోసి వెడల్పు చేయాల్సి ఉంటుంది. అయితే మట్టిని వేరే ప్రాంతాల నుంచి ప్రభుత్వం అనుమతితో తీసుకురావాలి కానీ దూరం వెళితే అధిక ఖర్చు అవుతుందని, ఎలాంటి లాభం ఉండదనే ఉద్దేశంతో రైతుల అనుముతుల తీసుకోకుండానే రోడ్డు పక్కనే ఉన్న పంట పొలాల్లో పెద్ద పెద్ద ప్రొక్లెయినర్లతో 5 నుంచి 6 ఫీట్ల లోతు గాతులను తవ్వి మట్టిని రోడ్డుకు పోస్తున్నాడు. ఇప్పటి వరకు దాదాపు మూడు కిలోమీటర పరిధిలోనే దాదాపు 40 మంది రైతుల పంటపొలాల్లో గాతులు తవ్వి ఆ మట్టిని రోడ్డు విస్తరణకు వినియోగిస్తున్నాడు. మా పంట పొలాల్లో ఎందుకు మట్టి తీస్తున్నావని ప్రశ్నిస్తే వారితో ఘర్షణ పడుతూ మీ దిక్కు ఉన్న చోట చెప్పుకొమ్మని బెదిరిస్తున్నారని బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక మంత్రి నియోజకవర్గంలోనే రైతులకు అన్యాయం జరుగుతుంటే మేము ఎవరికి చెప్పుకోవాలని రైతులు కంటతడి పెడుతున్నారు. అయితే ప్రభుత్వ పనులకు కాంట్రాక్టర్ మట్టి కావాలంటే తప్పనిసరిగా రెవెన్యూ, మైనింగ్ అధికారులకు సెస్ చెల్లించి మట్టిని తోలేందుకు అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. కానీ సెస్ కట్టకుండానే కాంట్రాక్టర్ ప్రభుత్వ పని అని చెబుతూ ఎక్కడ మట్టి కనిపిస్తే ఆ మట్టిని టిప్పర్ల ద్వారా తీసుకెళ్తాన్నాడు. ఈ తవ్వకాలను నిలుపుదల చేయాలనే చూసే రెవెన్యూ అధికారులను సైతం బెదిరిస్తున్నాడనే ప్రచారం జరుగుతోంది.

రెండు మడుల్లో పెద్ద గాతులు తీశారు

మాకు జానలదిన్నెలో రోడ్డు వెంట రెండెకరాల పంట భూమి ఉంది. దీంట్లో మూడు పెద్ద మడుగులు ఉన్నాయి. ఈ మడుగులు ఆర్‌అండ్‌బీ స్థలం అంటూ మనిషిలోతు గాతులు తీశారు. మాకు ఈ విషయం తెలిసి పొలం వద్దకు వెళ్లేసరికి అప్పటికే మట్టిని తరలించారు. ఈ విషయంపై కాంట్రాక్టర్‌ను నిలదీస్తే మాకు పైనుంచి అనుమతి ఉందంటూ బెదిరిస్తున్నాడు. పంట పొలాల్లో మట్టి తవ్వకాలు వెంటనే నిలిపివేసి మాకు న్యాయం చేయాలి.

– వెంకటరమణ, నేరేడుచర్ల

రైతుల అనుమతి ఉంటేనే మట్టి తీయాలి

ఆర్‌అండ్‌బీ రోడ్డు ఎంత వరకు ఉందో అంత వరకు హద్దులను ఏర్పాటు చేసి కాంట్రాక్టర్‌కు అప్పగించాం. ప్రస్తుతం నేరేడుచర్ల నుంచి దూపాడు వరకు జరుగుతున్న రోడ్డు పనుల్లో భాగంగా 100 ఫీట్ల రోడ్డు అయినందున 100 ఫీట్లు లోపు తవ్వారా లేక పరిధి దాటి తవ్వారా అనే విషయం పరిశీలిస్తాం. వంద ఫీట్లు దాటి మట్టిని తీస్తే రైతులతో మాట్లాడి అనుమతి తీసుకొని మట్టిని తీయాల్సి ఉంటుంది.

– రమేష్ ఆర్‌అండ్‌బీ డీఈఈ

యూనిఫామ్ సిద్ధమవుతోంది

- ఇప్పటికే 50 శాతం కుట్టుపని పూర్తి
- మిగతావి 31లోగా పూర్తి చేయాలని అధికారుల ఆదేశం
- పాఠశాలలు తెరిచే నాటికి అందించేలా ప్రణాళిక
- మొదటి విడతలో ఒక్కో జత పంపిణీకి ఏర్పాట్లు



యూనిఫామ్ కుట్టే విధానాన్ని పరిశీలిస్తున్న సమగ్రశిక్ష ప్రాజెక్టు డైరెక్టర్ రాధారెడ్డి (ఫైల్)

పాఠశాలలు	విద్యార్థులు
950	49,374
కుట్టుపని పూర్తయిన జతలు 24,579	

సూర్యాపేటటౌన్ : ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు వచ్చే విద్యాసంవత్సరంలో పాఠశాలల పునఃప్రారంభమయ్యే జూన్ 12 నాటికి అందించేందుకు విద్యాశాఖ యూనిఫామ్ సిద్ధం చేయిస్తోంది. ప్రభుత్వం ఏటా విద్యార్థులకు ఉచిత పాఠ్య పుస్తకాల తోపాటు యూనిఫామ్ అందజేస్తుంది. అయితే ఈ ఏడాది ప్రతి విద్యార్థికి ఒక్కో జత యూనిఫామ్ అందించాలని నిర్ణయించింది. ఈ మేరకు గడిచిన విద్యా సంవత్సరం ముగిసే నాటికే వస్త్రం పంపిణీ చేసింది. గతంలో తరగతులు మొదలైన తర్వాత కూడా దుస్తులు అందించలేదు. అలాంటి పరిస్థితి పునరావృతం కాకుండా దుస్తుల కుట్టే బాధ్యతను ప్రత్యేకంగా స్వయం సహాయక సంఘాల సభ్యులకు అప్పగించింది. ఫిబ్రవరి, మార్చి నెలల్లోనే మున్సిపాలిటీ పరిధిలో మెప్మా సిబ్బంది, గ్రామాల్లో వీఓఏలు ప్రతి విద్యార్థి కొలతలను సేకరించారు. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా 50శాతం వరకు కుట్టుపని పూర్తయినట్టు అధికారులు చెబుతున్నారు.

49,374 మంది విద్యార్థులు

జిల్లాలో ప్రభుత్వ ఉన్నత, ప్రాథమికోన్నత, ప్రాథమిక పాఠశాలలు మొత్తం 950 ఉన్నాయి. వీటిలో బాలురు 23,547 మంది విద్యనభ్యసిస్తుండగా బాలికలు 25,827 మంది విద్యనభ్యసిస్తున్నారు. వీరికి ఒక్కో జత చొప్పున 49,374 జతలు కుడుతున్నారు. అయితే ఇప్పటి వరకు 24,579 జతలు పూర్తయ్యాయి. మిగతావి కూడా ఈ నెల 31వ తేదీ వరకు పూర్తి చేయాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. రెండో జత వస్త్రం కూడా వస్తుందని.. వాటి కుట్టుపని కూడా జూన్ 10వ తేదీలోపు పూర్తిచేయాలని విద్యాశాఖ అధికారులకు సూచించారు.

ఒక్కో జతకు రూ.75 కుట్టు కూలి..

విద్యార్థుల యూనిఫామ్ ఒక్కో జత కుట్టు కూలి కింద మహిళా సంఘాల సభ్యులకు రూ.75 చొప్పున చెల్లిస్తున్నారు. గతంలో రూ.50 మాత్రమే ఇవ్వడంతో కూలి గిట్టుబాటు కావడం లేదని ప్రభుత్వానికి విన్నవించారు. దీంతో ప్రభుత్వం గత విద్యాసంవత్సరం రూ.25 పెంచింది. దీంతో ఒక్కో జత రూ.75 ఇస్తున్నారు. దీంతో మహిళా సంఘాల సభ్యులకు ఆర్థికంగా కొంత తోడ్పాటుకానుంది.

పాఠశాలల పునఃప్రారంభం రోజే అందిస్తాం



ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు పాఠ్య పుస్తకాల తోపాటు యూనిఫామ్ కూడా అందించేందుకు సన్నద్ధ చేస్తున్నాం. ఇప్పటి వరకు ఒక్కో జత చొప్పున వస్త్రం రాగా కుట్టే పని కూడా 50శాతంపైగా పూర్తయ్యింది. ఈ నెల 31వ తేదీ లోపు మొదటి జత పూర్తి చేయిస్తాం. రెండో జత కూడా త్వరలో వస్తుంది. జూన్ 12న పాఠశాలల పునఃప్రారంభం రోజే విద్యార్థులకు యూనిపామ్ అందజేస్తాం.

– అశోక్, డీఈఓ, సూర్యాపేట

సెర్ప్ ఉద్యోగుల బదిలీలు?

నల్లగొండ : పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్)లో బదిలీలకు రంగం సిద్ధమైంది. దీర్ఘకాలికంగా విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులను బదిలీ చేయడానికి రాష్ట్రస్థాయిలో నిర్ణయం జరిగింది. నిబంధనల ప్రకారం 30 శాతం ఉద్యోగులను మాత్రమే బదిలీ చేయాల్సి ఉంటుంది. కానీ, వంద శాతం బదిలీలకు అనుమతిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మొత్తం ఎంత మంది, ఏ ప్రాతిపదికన బదిలీ చేయాలి.. తదితర అంశాలపై శనివారం సెర్ప్ అధికారులు రాష్ట్రస్థాయిలో యూనియన్ నాయకులతో సమావేశమై చర్చించనున్నట్లు తెలిసింది. కౌన్సెలింగ్ ద్వారా బదిలీల ప్రక్రియ చేపట్టాలని ఉద్యోగులు కోరుతున్నారు.

యాదగిరీశుడికి లక్ష పుష్పార్చన



ఉత్సవ మూర్తులకు పుష్పార్చన చేస్తున్న అర్చకుడు

యాదగిరిగుట్ట : యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో శుక్రవారం ఏకాదశి పూజలు శాస్త్రోక్తంగా చేపట్టారు. ప్రధానాలయ ముఖ మండపంలో ఉత్సవమూర్తులను వివిధ పుష్పమాలికలు, పట్టువస్త్రాలు, బంగారు, వజ్రవైఢూర్యాలతో దివ్యమనోహరంగా అలంకరించిన అర్చకులు ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. వేదమంత్రాలు, మంగళవాయిద్యాల మధ్య లక్ష పుష్పార్చన నిర్వహించారు. ఈ వేడకలో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. అదే విధంగా ప్రధానాలయంలో సంప్రదాయ పూజలు కొనసాగాయి.

మెడికల్ మాఫియాను అరికట్టాలి



సూర్యాపేటలో కలెక్టరేట్ ఏఓకు వినతిపత్రం అందిస్తున్న మాస్‌లైన్ నాయకులు

భానుపురి (సూర్యాపేట) : సూర్యాపేటలో కొనసాగుతున్న మెడికల్ మాఫియాను అరికట్టాలని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శివకుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం పార్టీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముందు ధర్నా నిర్వహించి కార్యాలయ ఏఓకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ వైద్యరంగాన్ని బలోపేతం చేసి, అన్ని వర్గాల ప్రజలకు వైద్యసేవలు అందుబాటులోకి తేవాలన్నారు. ప్రైవేటు యాజమాన్యాలకు విచ్చలవిడిగా అనుమతులు జారీ చేస్తూ, ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్న డీఎంహెచ్ఓను తొలగించాలన్నారు. అర్హతలు లేకున్నా, తప్పుడు సర్టిఫికెట్ల ద్వారా వైద్యం అందిస్తున్న ప్రైవేట్ యాజమాన్యాలను అరెస్టు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పీఓడబ్ల్యూ జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి రేణుక, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అఖిల్ కుమార్, ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం, టీయూసీఐ, ఆయా సంఘాల నాయకులు పేర్ల నాగయ్య, ఎస్కే.గులాం, సంతోషి, కట్టా కల్పన, పేర్ల మల్లమ్మ, గుండ గాని రేణుక, ఎస్కే.కరీంబీ, విజయ్‌రెడ్డి, అంజయ్య, కట్టా రమేష్, పాల్వాయేసు, బొజ్జ ముత్తయ్య, పాల్వాయి అనసూయ తదితరులు పాల్గొన్నారు.

విద్యాప్రమాణాలు మెరుగుపడేలా..

- ఉపాధ్యాయుల్లో నైపుణ్యాభివృద్ధి..
- విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలు పెంపే లక్ష్యంగా
- ఐదు రోజులుగా టీచర్లకు శిక్షణ
- నేటితో ముగియనున్న ప్రక్రియ



డిజిటల్ బోధనా పద్ధతులను వివరిస్తున్న ట్రైనర్లు

ప్రభుత్వ పాఠశాలలు	ఉపాధ్యాయులు
1,050	4,016
విద్యార్థులు 1,24,000	

తాళ్లగడ్డ (సూర్యాపేట): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాప్రమాణాలు మెరుగుపర్చడంతోపాటు పిల్లల్లో అభ్యసన సామర్థ్యాలు, బోధనలో నాణ్యత, సాంకేతికత పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేసింది. ఇందులో భాగంగా వచ్చే విద్యాసంవత్సరంలో పిల్లలకు అర్థవంతమైన బోధన చేసేలా ఉపాధ్యాయులు నైపుణ్యాభివృద్ధి సాధించేలా ఈ వేసవి సెలవుల్లోనే వృత్యంతర శిక్షణ ఇప్పిస్తోంది. ఉపాధ్యాయుల్లో సామర్థ్య నిర్మాణం మెరుగుపరిచే ఉద్దేశంతో సూర్యాపేట జిల్లాకేంద్రానికి సమీపంలోని దురాజ్‌పల్లిలో గల స్వామినారాయణ గురుకుల పాఠశాలలో 84 మంది డిస్ట్రిక్ట్ రిసోర్స్ పర్సన్ల (డీఆర్‌పీల) సమక్షంలో ఐదు రోజులుగా ఇస్తున్న శిక్షణ శనివారంతో ముగియనుంది.

శిక్షణ ఇలా..

జిల్లాలో విడతల వారీగా శిక్షణ తరగతులు నిర్వహించారు. మొదటి విడతలో కోదాడ, తుంగతుర్తి నియోజకవర్గాల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకు ఈ నెల 13 నుంచి 17 వరకు శిక్షణ తరగతులు నిర్వహించారు. అలాగే ఈ నెల 20 నుంచి సూర్యాపేట, హుజూర్‌నగర్ నియోజకవర్గాల పరిధిలోని పాఠశాలల ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్నారు. శిక్షణలో భాగంగా తెలుగు, హిందీ, ఆంగ్లం, గణితం, భౌతిక, రసాయన, జీవ, సాంఘిక శాస్త్రాలను డీఆర్‌పీలు తర్ఫీదు ఇచ్చారు. ఈ రెండవ విడత శిక్షణ తరగతులు నేటితో ముగియనున్నాయి. అలాగే మండల స్థాయి ఉపాధ్యాయులకు ప్రతి మండలంలో ఒక కేంద్రాన్ని ఏర్పాటు చేసి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. మూడవ విడతలో హెచ్‌ఎంలకు నాయకత్వ లక్షణాల పెంపుపై శిక్షణ ఉండనుంది.

నైపుణ్యాభివృద్ధి.. సందేహాల నివృత్తి

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు తెలుగు, ఇంగ్లిష్‌లో ధారాళంగా చదవడం రాయడంతోపాటు చతుర్విధ ప్రక్రియల్లో పట్టు సాధించేలా ఉపాధ్యాయుల్లో నైపుణ్యాభివృద్ధి పెంపొందించారు. వచ్చే ఏడాది నుంచి అమలు కానున్న కృత్రిమ మేధ (ఏఐ) పాఠాలు అందిపుచ్చుకోవడం, విద్యార్థుల హాజరు శాతం పెంపు, తల్లిదండ్రులతో సమావేశాలు నిర్వహించడంతో బాటుగా ఆకర్షణీయమైన బోధన మెలకువలు నేర్పించారు. బోధనోపకరణాలు, ఉపాధ్యాయులకు ఉన్న పలు సందేహాలను నివృత్తి చేశారు.

ఈ శిక్షణలో భాగంగా పాఠశాల అభివృద్ధికి వచ్చే నిధులను సక్రమంగా, సమర్థవంతంగా ఉపయోగించడం, కొత్త బోధనా పద్ధతులను ఆవిష్కరిస్తూ పిల్లల మానసిక వికాసాన్ని పెంపొందిస్తూ తరగతులు నిర్వహించేలా పలు రకాల పద్ధతులను వివరించారు.


బోధన సామర్థ్యాలు మెరుగు



సహజంగానే ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయ శిక్షణ పొందిన వారితో మెరుగైన బోధన ఉంటుంది. ప్రస్తుతం ఇస్తున్న వృత్యంతర శిక్షణ వల్ల బోధనా సామర్థ్యాలు మెరుగుపడతాయి. విద్యార్థుల లోపాలను సరిదిద్దుతూ సమర్థవంతంగా బోధించవచ్చు.

– గుండు అంజనీకుమార్, ఉపాధ్యాయుడు

చాలా విషయాలు నేర్చుకున్నాం..



వృత్యంతర శిక్షణలో చాలా విషయాలు నేర్చుకున్నా. ముఖ్యంగా సాంకేతిక ప్రమాణాలు పెంపొందించే పలు రకాల పద్ధతులను వివరించాలి. తరగతి గదిలో పిల్లల మానసిక స్థితిని బట్టి ప్రయోగాత్మకంగా బోధిస్తే చదువుపై ప్రత్యేక దృష్టిసారిస్తారు.

– జోగం నరేష్, ఉపాధ్యాయుడు

క్లుప్తంగా

గ్రూప్‌-2 ఉద్యోగానికి మల్లాపురం వాసి ఎంపిక


హరిబాబు

పెద్దఅడిశర్లపల్లి : పెద్దఅడిశర్లపల్లి మండలం మల్లాపురం గ్రామానికి చెందిన నారాయణదాసు హరిబాబు గ్రూప్‌– 2 ఉద్యోగానికి ఎంపికయ్యాడు. ఉస్మానియా క్యాంపస్‌లో ఎల్‌ఎల్‌బీ ఫైనల్‌ ఇయర్‌ చదువుతున్న ఈయన గ్రూప్‌ – 2 పరీక్ష రాసి 606 ర్యాంక్‌ సాధించాడు. దీంతో మండలవాసులు హరిబాబుకు అభినందనలు తెలిపారు.

ద్విచక్ర వాహనాలు ఢీకొని ఇద్దరికి గాయాలు

గుండాల : ఎదురుదురుగా ద్విచక్ర వాహనాలు ఢీకొనడంతో ఇద్దరు గాయాలపాలైన సంఘటన గుండాల మండలంలోని సుద్దాల గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుండాల గ్రామానికి చెందిన అల్తాఫ్‌ సుద్దాల గ్రామం వైపు బైక్‌పై వెళ్తుండగా.. సుద్దాల గ్రామానికి చెందిన గూడ వెంకటేష్‌ వ్యవసాయ బావి నుంచి వస్తూ సబ్‌ స్టేషన్‌ ఆవరణలో ఎదురెదురుగా ఢీకొన్నారు. ఇద్దరిని 108 వాహనంలో జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు ఎస్‌ఐ సైదులు తెలిపారు.

ఎడ్లబండిని ఢీకొని యువకుడు మృతి


నర్సింహ (ఫైల్‌)

మునుగోడు: ఎద్దులబండిని ఢీకొని యువకుడు మృతిచెందిన సంఘటన శుక్రవారం మునుగోడులో చోటుచేసుకుంది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మునుగోడు పట్టణానికి చెందిన పందుల నర్సింహ(26) ఇళ్లకు పెయిటింగ్‌ వేస్తూ జీవనం సాగిస్తున్నాడు. గురువారం చీకటిమామిడి గ్రామానికి తన బైక్‌పై వెళ్లి తిరిగి వస్తుండగా మార్గమధ్యంలో ఎంపీడీఓ కార్యాలయ సమీపంలో ఎడ్ల బండిని బలంగా ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. అతడిని నల్లగొండలోని ప్రైవేట్‌ ఆస్పత్రికి తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారుజామున మృతి చెందాడు. మృతుడి తల్లి ధనమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రవి తెలిపారు.

నాడు సాగు భూమి.. నేడు ఆధ్యాత్మిక వాడ

యాదగిరిగుట్ట: ఒకప్పుడు పచ్చని పంటలతో కనిపించే ప్రాంతమంతా నేడు ఆధ్యాత్మిక వాడగా రూపుదిద్దుకుంది. యాదగిరి కొండకు దిగువన 2016కంటే ముందు పంట పొలాలతో ఉండేది. ఇప్పుడు యాదగిరి క్షేత్ర అభివృద్ధిలో భాగంగా భక్తుల కోసం ఆధ్యాత్మిక భవనాలు నిర్మించారు. ప్రస్తుతం కొండకు దిగువన ఉత్తర దిశలో శ్రీసత్యనారాయణస్వామి వ్రత మండపం, లక్ష్మీ పుష్కరిణి, దీక్షా పరుల మండపం, కల్యాణ కట్ట, ఆర్టీసీ బస్టాండ్‌, సెంట్రల్‌ పార్కింగ్‌, ప్రెసిడెన్షియల్‌ సూట్‌ నిర్మాణాలు చేశారు. చెట్లను, గుట్టలను, పొలాలను తొలగించి పెద్ద రోడ్లు వేసి ఆకుపచ్చని అందం సంతరించుకునేలా మొక్కలు నాటారు. ఒకప్పుడు పచ్చని పొలాలు, చెట్లతో ఉన్న ఆ ప్రాంతమంతా ఇప్పుడు ఆధ్యాత్మిక వాడగా రూపుదిద్దుకుంది.


2016కు ముందు యాదగిరి కొండకు దిగువన ఉత్తర దిశలో ఉన్న పంట పొలాలు, పచ్చని చెట్లు


యాదగిరి క్షేత్ర అభివృద్ధిలో భాగంగా భక్తుల కోసం నిర్మించిన ఆధ్యాత్మిక కట్టడాలు

చైన్‌స్నాచింగ్‌ కేసులో ముగ్గురు అరెస్ట్‌

- నిందితుల నుంచి 5గ్రాముల బంగారం, బైక్‌, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం
- నల్లగొండ జైలుకు ఇద్దరు, సైదాబాద్‌ జువైనల్‌ హోంకు ఒకరి తరలింపు
- వివరాలు వెల్లడించిన చౌటుప్పల్‌ సీఐ మన్మథకుమార్‌

చౌటుప్పల్‌ రూరల్‌: చౌటుప్పల్‌ మండలం ఖైతాపురం గ్రామంలో చైన్‌స్నాచింగ్‌కు పాల్పడిన ముగ్గురిని శుక్రవారం హైదరాబాద్‌లోని ఎల్‌బీ నగర్‌ ప్రాంతంలో సీసీఎస్‌ పోలీసులు అరెస్ట్‌ చేసి చౌటుప్పల్‌ పోలీసులకు అప్పగించారు. వారి నుంచి 5గ్రాముల బంగారం, మూడు సెల్‌ఫోన్లు, బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. చౌటుప్పల్‌ సీఐ మన్మథకుమార్‌ తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా కోదాడ పట్టణంలోని శ్రీనివాస నగర్‌కు చెందిన ఎటికల ఫణిచందు(18), కోదాడ పట్టణం పెరిక హాస్టల్‌ ప్రాంతానికి చెందిన బాలుడు (17), మేడ్చల్‌ మల్కాజిగిరి పట్టణంలోని యాదవ్‌ నగర్‌కు చెందిన గుదాల తిరుమల్‌ (19) గతంలో వేర్వేరుగా కోదాడ, సూర్యాపేట, మేడ్చల్‌ ప్రాంతాల్లో చిన్నచిన్న దొంగతనాలకు పాల్పడుతుండేవారు. గతంలో పోలీసులు కేసు నమోదు చేసి మైనర్లు కావడంతో సైదాబాద్‌లోని జువైనల్‌ హోంకు తరలించారు. అందులో వీరి ముగ్గురి మధ్య స్నేహం ఏర్పడింది. బయటకు వచ్చి, ఎవరి ప్రాంతంలో వారు నివసిస్తుండగా ఇన్‌స్టాగామ్‌లో కలుసుకుని ఫోన్‌ నంబర్లు తీసుకుని ప్రతిరోజు ఫోన్‌లో మాట్లాడుకునే వారు. జల్సాలకు అలవాటు పడి ఎలాగైనా డబ్బు సంపాదించాలని నిర్ణయించుకున్నారు. ఇలా ముగ్గురు కలిసి దొంగతనాలకు ప్లాన్‌ చేసుకున్నారు. ఈక్రమంలో మేడ్చల్‌లో ఉన్న తిరుమల్‌తోపాటు, కోదాడలో ఉన్న ఫణిచందు, మైనర్‌ బాలుడు బైక్‌పై ఈ నెల 21న చౌటుప్పల్‌కు చేరుకున్నారు. ముగ్గురు కలిసి బైక్‌పై హైదరాబాద్‌ వైపు బయలుదేరి వెళ్తుండగా మధ్యలో ఉన్న ఖైతాపురం గ్రామంలో ఒంటరిగా వెళ్తున్న వృద్ధురాలి మెడలో ఉన్న బంగారు గొలుసును చోరీ చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని హైవేపై సీసీ కెమెరాలను పరిశీలించారు. నిందితులు హైదరాబాద్‌ వైపు వెళ్తున్నట్లు గుర్తించారు. సీసీఎస్‌ పోలీసులు రంగంలోకి దిగి విచారణ చేపట్టారు. హైదరాబాద్‌లోని ఎల్‌బీ నగర్‌ ప్రాంతంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న ముగ్గురిని పోలీసులు పట్టుకుని విచారించగా వారు చోరీ చేసినట్లు అంగీకరించారు. సీసీఎస్‌ పోలీసులు నిందితులను చౌటుప్పల్‌ పోలీసులకు అప్పగించారు. ఈమేరకు చౌటుప్పల్‌ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసి వారి నుంచి 5గ్రాముల బంగారం, మూడు సెల్‌ఫోన్లు, బైక్‌ను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. ఫణిచందు, తిరుమల్‌ను నల్లగొండ జైలుకు, మరో వ్యక్తి మైనర్‌ కావడంతో సైదాబాద్‌లోని జువైనల్‌ హోంకు తరలించినట్లు సీఐ మన్మథకుమార్‌ తెలిపారు.

రాజకీయ కక్షతోనే కేసీఆర్‌కు నోటీసులు

- మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

నార్కట్‌పల్లి: ప్రజలు కేసీఆర్‌ పాలనను గుర్తు చేసుకోవడం చూసి కాంగ్రెస్‌ ప్రభుత్వం ఓర్వలేకపోతోందని, రాజకీయ కక్షతోనే నోటీసులు ఇచ్చిందని మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ఆరోపించారు. శుక్రవారం నార్కట్‌పల్లి పట్టణ కేంద్రంలోని క్యాంప్‌ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. హైదరాబాద్‌కు వచ్చిన మిస్‌ వరల్డ్‌ పోటీదారులు రాష్ట్రంలో కేసీఆర్‌ చేసిన అభివృద్ధిని గుర్తు చేశారని తెలిపారు. తెలంగాణ దివాలా తీసి వేలకోట్ల రూపాయలు కొల్లగొట్టడం వల్లే ఈడీ కేసులో రేవంత్‌రెడ్డి అడ్డంగా ఇరుక్కుపోయారని విమర్శించారు. కాంగ్రెస్‌ పాలనలో రోజురోజుకు కుమ్ములాటలు బయటికి వస్తున్నాయన్నారు. 30 శాతం పర్సంటేజీ ఇవ్వనిదే సొంత ప్రభుత్వంలో పనులు కావడం లేదని సాక్షాత్తు కాంగ్రెస్‌ ఎమ్మెల్యే బట్టబయలు చేశారన్నారు. ఇచ్చిన హామీలు నెరవెర్చలేక పరిపాలన వైఫల్యాన్ని కప్పి పుచ్చుకునేందుకు రేవంత్‌రెడ్డి కాళేశ్వరం కమిషన్‌ నోటీసు కుట్రలకు తెరలేపుతున్నారని దుయ్యబట్టారు. ధాన్యం కొనుగోళ్లు ఇప్పటి వరకు 40 శాతం కూడా జరగలేదని, కేంద్రాల వద్ద కుప్పలు వానకు తడుస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో బీఆర్‌ఎస్‌ నాయకులు బైరెడ్డి కరుణాకర్‌రెడ్డి, యానాల అశోక్‌రెడ్డి, కొండూరు శంకర్‌, తరాల బలరాం, జ్యోతి బలరాం, కోటిరెడ్డి, సుధీర్‌, సతీష్‌, దుబ్బ మధు, సత్తిరెడ్డి, ప్రకాష్‌, సాయి తదితరులు పాల్గొన్నారు.

పోలీస్‌ వాహనం బోల్తా

నాంపల్లి: మండలంలోని రాయినికుంటతండా సమీపంలో పోలీస్‌ వాహనం టైర్‌ పేలడంతో అదుపు తప్పి బోల్తా పడింది. శుక్రవారం నాంపల్లి నుంచి నేరళ్లపల్లికి వెళ్తుండగా రాయినికుంట తండా వద్ద రోడ్డుపై కంకర ఉండడంతో వాహనం టైరు పగిలి పక్కనే ఉన్న రాళ్లకు ఢీకొని బోల్తాపడింది. అందులో ఉన్న ఇద్దరు పోలీసులకు స్వల్ప గాయాలు కాగా వారిని స్థానిక ఆస్పత్రికి తరలించారు.


రాయిణికుంట తండాలో అదుపుతప్పి బోల్తాపడిన పోలీస్‌ వాహనం

అదుపుతప్పి కారు బోల్తా

- ఒకరు మృతి.. ఏడుగురికి తీవ్రగాయాలు
- దైవ దర్శనానికి వచ్చి, తిరిగి వెళ్తుండగా ఘటన


గాయపడిన రామస్వామి


ధ్వంసమైన కారు

బీబీనగర్‌: దైవ దర్శనానికి వచ్చి తిరిగి వెళ్తుండగా కారు అదుపు తప్పి బోల్తా కొట్టడడంతో ఒకరు మృతి చెందగా.. ఏడుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన శుక్రవారం బీబీనగర్‌ మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. రంగారెడ్డి జిల్లా మొయినాబాద్‌కు చెందిన చేగూరి రామస్వామిగౌడ్‌(60), లక్ష్మి దంపతులు, వారి కోడళ్లు భూమిక, మనీష తోపాటు వీరి పిల్లలైన అక్షిత్‌, అక్షయ్‌, శ్రీయాంక, సహస్రలతో కలిసి గురువారం సాయంత్రం కారులో యాదగిరిగుట్టలోని శ్రీలక్ష్మీ నర్సింహ స్వామి దర్శనానికి వచ్చారు. శుక్రవారం ఉదయం స్వామివారి దర్శనం చేసుకొని తిరిగి మొయినాబాద్‌కు బయలుదేరారు. బీబీనగర్‌కు రాగానే జాతీయ రహదారిపై గల ఫ్లైఓవర్‌ సమీపంలో కారు అదుపు తప్పి సర్వీస్‌ రోడ్డుపైకి పల్టీ కొట్టింది. దీంతో కారు పూర్తిగా ధ్వంసం కాగా అందులో ఉన్న ఎనిమిది మందికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రులను బయటకు తీశారు. నేషనల్‌ హైవే అంబులెన్స్‌లో వారిని భువనగిరి ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లగా రామస్వామి, లక్ష్మితోపాటు, మరొకరి పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌లోని ప్రైవేట్‌ ఆస్పత్రికి తరలించారు. రామస్వామి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. ప్రమాదానికి గురైన కారులో నలుగురు ఐదేళ్లలోపు చిన్నారులే ఉన్నారు.

బైక్‌ను తుఫాన్‌ ఢీకొట్టడంతో ఒకరు మృతి

యాచారం: నాగార్జునసాగర్‌–హైదరాబాద్‌ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. వివరాలు.. నల్లగొండ జిల్లా చందంపేటకు చెందిన కృష్ణ(32) గురువారం అర్ధరాత్రి బైక్‌పై రంగారెడ్డి జిల్లా యాచారం నుంచి మాల్‌ వైపు వెళ్తున్నాడు. మార్గ మధ్యలో చింతపట్ల గేట్‌ వద్ద తుఫాన్‌ వాహనం ఢీకొట్టింది. ఈ సంఘటనలో కృష్ణకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు యాచారం సీఐ నందీశ్వర్‌రెడ్డి తెలిపారు.

స్వర్ణగిరి క్షేత్రంలో తిరువీధి ఉత్సవసేవ


తిరువీధి ఉత్సవసేవ నిర్వహిస్తున్న అర్చకులు, పాల్గొన్న భక్తులు

భువనగిరి: పట్టణ శివారులోని స్వర్ణగిరి క్షేత్రంలో శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో శుక్రవారం సాయంత్రం తిరువీధి ఉత్సవసేవ వైభవంగా నిర్వహించారు. అంతకు ముందు ఉదయం స్వామి వారికి సుప్రభాత సేవ, పంచామృతాభిషేకం, సహస్రనామార్చన సేవ, సుదర్శన నరసింహ హవనం, నిత్య కల్యాణ మహోత్సవం, మధ్యాహ్నం సుమారు 3వేల మంది భక్తులకు అన్నప్రసాద వితరణ, సాయంత్రం సహస్ర దీపాలంకరణ సేవ, పద్మావతి అమ్మవారికి కుంకుమార్చన సేవ జరిపించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం


బుచ్చిరెడ్డి(ఫైల్‌)

చౌటుప్పల్‌ : పట్టణ కేంద్రంలోని వలిగొండ రోడ్డులో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చౌటుప్పల్‌ మండల పరిధిలోని అల్లాపురం గ్రామానికి చెందిన గూడూరు బుచ్చిరెడ్డి (59), పక్కీరు అల్వాల్‌రెడ్డి పట్టణ కేంద్రంలోని వలిగొండ రోడ్డులో తాళ్లసింగారం క్రాస్‌రోడ్డు సమీపంలో ఉన్న ఫంక్షన్‌ హాల్‌లో జరుగుతున్న తమ గ్రామస్తుడి వివాహానికి హాజరయ్యేందుకు ద్విచక్ర వాహనంపై వెళ్తున్నారు. ఈక్రమంలో బాలాజీ దేవాలయం దాటిన తర్వాత వలిగొండ వైపు వెళ్తున్న పెట్రోల్‌ ట్యాంకర్‌ వీరి ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. దీంతో బైక్‌ నడుపుతున్న అల్వాల్‌రెడ్డి, వెనుక కూర్చున్న బుచ్చిరెడ్డి ఎగిరి రోడ్డుపై పడిపోయారు. అదే సమయంలో ట్యాంకర్‌ బుచ్చిరెడ్డి పైనుంచి వెళ్లడంతో శరీర భాగాలు ఛిద్రమై అక్కడికక్కడే మృతిచెందాడు. అల్వాల్‌రెడ్డికి గాయాలుకాగా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మన్మథకుమార్‌ తెలిపారు.

భార్యతో గొడవపడి ఆత్మహత్యాయత్నం

- కాపాడిన పోలీసులు


ఆత్మహత్యకు యత్నించిన హరీష్‌

అర్వపల్లి: మండల పరిధిలోని అడివెంల గ్రామానికి చెందిన రాయపర్తి హరీష్‌ పది రోజుల కిందట తన భార్య మౌనికతో గొడవపడ్డాడు. ఆమె పుట్టింటికి వెళ్లి తిరిగి రాకపోవడంతో ఆత్మహత్య చేసుకుంటానని పురుగుల మందు డబ్బాతో శుక్రవారం గ్రామ శివారులోని గుట్ట ఎక్కి తన బంధువులకు వీడియోకాల్‌ చేసి చెప్పాడు. దీంతో అతడి బంధువులు, గ్రామస్తులు గుట్ట వద్ద వెతకగా ఆచూకీ దొరకకపోవడంతో 100నంబర్‌కు డయల్‌ చేశారు. అర్వపల్లి ఎస్‌ఐ బాలకృష్ణ, పోలీస్‌ సిబ్బంది పసులేటి సైదులు, మణికుమార్‌లు గుట్ట వద్దకు వెళ్లి ఫోన్‌ లొకేషన్‌ ఆధారంగా వెతికి హరీష్‌ను పట్టుకున్నారు. అతడి వద్ద ఉన్న పురుగుల మందు డబ్బాను స్వాధీనం చేసుకుని బంధువులకు అప్పగించారు. హరీష్‌ ప్రాణాలు కాపాడిన పోలీసులకు బంధువులు, గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యుదాఘాతానికి గురై ఐదు గేదెలు మృతి

రామన్నపేట: విద్యుదాఘాతానికి గురై ఐదు పాడి గేదెలు మృతి చెందాయి. ఈ సంఘటన శుక్రవారం రామన్నపేట మండలంలోని శోభనాద్రిపురం గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. శోభనాద్రిపురం గ్రామానికి చెందిన జక్కిలి ఐలయ్యకు చెందిన మూడు పాడిగేదెలు, జక్కిలి పద్మ, పోలేపల్లి సత్తయ్యలకు చెందిన ఒక్కో గేదె గ్రామశివారులోని పెసరు అనంతరెడ్డికి చెందిన పొలంలో మేత మేస్తుండగా తెగిపడి ఉన్న విద్యుత్‌ తీగ వాటికి తగిలింది. దీంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందాయి. ఒక్కో గేదె విలువ రూ 1.50లక్షల వరకు ఉంటుందని బాధిత రైతులు తెలిపారు. సమాచారం అందుకున్న రెవెన్యూ, పశుసంవర్ధక శాఖ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించారు. బాధిత రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

విరుల సాగుతో సిరులు


రాజామణి సాగు చేస్తున్న మల్లె పూల తోట

- పూల తోట సాగు చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్న మహిళా రైతు
- తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు
- మరో ఐదుగురికి ఉపాధి చూపుతున్న కూనూరు గ్రామానికి చెందిన రాజామణి

భువనగిరిటౌన్‌ : పూల సాగు చేస్తున్న మహిళా రైతుకు సిరులు కురుపిస్తోంది. ఆధ్యాత్మిక ప్రాంతం కావడంతో ఇటు మహిళా రైతుకు, అటు వ్యాపారులకూ లాభాల పంట పండుతోంది. భువనగిరి మండలంలోని కూనూరు గ్రామంలో మహిళా రైతు పాశం రాజామణి తనకున్న పది గుంటల విస్తీర్ణంలో పూల సాగు చేపట్టింది. సాధారణ పంటలతో పాటుగా పూల సాగుపై మక్కువ చూపింది. కనకాంబరం, మల్లె, బొండు మల్లె, జాజిమల్లె పూల తోట వేసింది. ప్రతిరోజు రూ.3వేల వరకూ వస్తాయని చెబుతోంది. తనతో పాటు మరో ఐదుగురికి ఉపాధి కల్పిస్తున్నట్లు పేర్కొంటుంది.

సొంత వ్యాపారం చేద్దామనుకున్న ప్రయత్నంలోనే పూల తోట సాగు

తన భర్త కూలీ పనికి పోవడం ఇష్టం లేకపోవడంతో పాశం రాజామణి సొంత వ్యాపారం పెట్టే ఆలోచనలో భాగంగా విజయవాడ నుంచి కేవలం 10 పూల మొక్కలు తెచ్చి పెట్టింది. వచ్చిన పూలు అమ్మగా కొంత ఆదాయం రావడంతో మరికొన్ని మొక్కలు తెప్పించి తమకున్న పది గుంటల భూమిలో నాటారు. ప్రస్తుతం 250 మొక్కలు వరకు సాగు చేస్తోంది. ఇందులో బొడ్డుమల్లె, సన్నజాజి, మరికొన్ని కనకాంబరాల మొక్కలు ఉన్నాయి. అంతే కాకుండా పూలదండలు అల్లుతున్న మహిళలకు కిలో రూ. 120నుంచి రూ.200ల వరకు ఇస్తుండడంతో వారికి ఉపాధి దొరుకుతోంది. చిరు వ్యాపారులు భువనగిరి, యాదగిరిగుట్టతో పాటు, వివిధ పెళ్లిల సీజన్‌లో అర్డర్లపై పంపిస్తోంది.

పూల సాగుతో అధిక లాభాలు



సీజన్‌లో పూల సాగుతో మంచి లాభాలు వస్తాయి. ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నాం. ఈ సాగుతో వచ్చే ఆదాయంతో నా ముగ్గరు కుమారులను ఉన్నత చదువులు చదివించాను. ప్రభుత్వం ప్రోత్సహిస్తే మరో ఎకరంలో సైతం పూల తోట సాగు చేస్తా.

– పాశం రాజామణి, కూనూరు, భువనగిరి మండలం

ప్రేమించిన యువతికి వివాహమైందని..

- మనస్తాపంతో ఉరేసుకున్న యువకుడు


మధు (ఫైల్‌)

భువనగిరి: ప్రేమించిన యువతి వివాహమైందని మనస్తాపానికి గురైన యువకుడు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన భువనగిరి మండలంలోని తుక్కాపురం గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన రాసాల అయిలయ్య, భాగ్యమ్మ కుమారుడు మధు(23) రోజుమాదిరిగా ఈ నెల 22న రాత్రి ఇంట్లో కుటుంబ సభ్యులతో కలిసి నిద్రించాడు. తల్లి భాగ్యమ్మ ఉదయం లేచి ఇంట్లో గదులను శుభ్రం చేసేందుకు వెళ్లింది. ఈ క్రమంలో మధు నిద్రించే గది తలుపు తెరిచింది. కుమారుడు ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకుని కనిపించాడు. స్థానికులు సమాచారం అందించడంతో అక్కడికి చేరుకున్న పోలీసులకు మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. ప్రేమించిన యువతి వివాహం కావడం తోపాటు, అప్పులు ఎక్కవ అయ్యాయనే బాధతో మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నట్లు తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు భువనగిరి రూరల్‌ సీఐ చంద్రబాబు తెలిపారు.

పశువులను తరలిస్తున్న వాహనం పట్టివేత


వాహనంలో తరలిస్తున్న పశువులు

మునగాల : మండల శివారులో జాతీయ రహదారిపై శుక్రవారం తెల్లవారుజామున కోదాడ నుంచి హైదరాబాద్‌కు ఓ వాహనంలో పశువులను తరలిస్తుండగా మండల పోలీసులు తనిఖీలు నిర్వహించి వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం.. కోదాడ నుంచి టీఎస్‌ 29 టీ 3458 నంబర్‌ గల అశోక్‌ లేలాండ్‌ వాహనంలో పది పశువులు (8ఆడ, రెండు మగ)ను హైదరాబాద్‌లోని కబేళాకు తరలిస్తుండగా తనిఖీలు చేపట్టి వాహానాన్ని స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు. కాగా కోదాడ పట్టణానికి చెందిన వేముల అనిల్‌, వాహనం డ్రైవర్‌ షేక్‌ అసీఫ్‌, క్లీనర్‌ సయ్యద్‌ బాబులపై కేసు నమోదు చేసి పట్టుబడిన పశువులను హైదరాబాద్‌లోని జియాగూడ గోశాలకు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.